క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పాతపాడు(విజయవాడరూరల్): దసరా పండుగను పురస్కరించుకొని పాతపాడు గ్రామ పంచాయతీలో మంగళవారం పారిశుద్ధ్య కార్మికులకు స్థానిక నేత కలపాల అబ్రహం దుస్తులను పంపిణీ చేశారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

అభయాంజనేయుడి సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం చేశారు. విజయదశమి పర్వదినం, స్వామి వారికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఆలయం వద్ద భక్తులు క్యూలో బారులు తీరి కనిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు అన్నదానం జరిగింది. దాత వేములపల్లి రవికుమార్, శాంతిప్రియ దంపతుల కుమారుడు సీతనాగ పవన్‌కుమార్ (ఎన్ఆర్ఐ) ఆర్థిక సహకారంతో అన్నదానం చేశారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్



గన్నవరం: మండలంలోని దావాజీగూడెం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో పాడి రైతులకు బోనస్ పంపిణీ చేశారు. మొత్తం 156 మంది రైతులకు రూ. 2.78 లక్షల బోనస్‌ను సంఘ అధ్యక్షుడు గొంది నరేంద్ర, రూట్ మేనేజర్ కె. ప్రసాద్ మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ 2022-23 సంవత్సరానికి సంఘం రూ. 4.98 లక్షల నికర లాభం సాధించిందన్నారు. దీనిలో 70 శాతం బోనస్ రూపంలో పాడి రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. అత్యధికంగా గేద, ఆవు పాలు పోసిన రైతులకు బహుమతులను అందజేశారు. రూట్ సూపర్‌వైజర్ పి.యాసిన్, పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

భగవతీ శ్రీరాజరాజేశ్వరీ..

ముగిసిన శ్రీ దేవి శరన్నవరాత్రులు



పెనమలూరులో శ్రీరాజరాజేశ్వరీదేవిగా..



యనమలకుదురులో రజతకవచదేవి అలంకరణలో..

పెనమలూరు: నియోజకవర్గంలో సోమవారం ఘనంగా దసరా పండుగ చేశారు. మండలంలోని ఆలయాల్లో భక్తజన సందడి కనిపించింది. యనమలకుదురు శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రజతకవచ దేవిగా శ్రీ పార్వతీదేవిని అలంకరించారు. అమ్మవారికి పూర్ణాహుతి చేసి దివ్య అలంకరణ చేశారు. అనంతరం చండీహోమం జరిగింది. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు హోమం చేసిన భక్తులకు నూతన వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. పెనమలూరులోని రామాలయం వద్ద అమ్మవారికి శ్రీరాజేశ్వరిదేవి అలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగించారు. గోసాల వైకుంఠపురం కనకదుర్గ ఆలయం, యనమలకుదురు లాకుల వద్ద ఉన్న శ్రీకనకదుర్గ ఆలయం, ఇతర దేవాలయాల్లో దసరా పండుగను వైభవంగా చేశారు. అమ్మవార్లను విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పోరంకి సాయిబాబా మందిరంలో దసరా ఉత్సవాలు చేయగా భక్తులు బాబాను దర్శించుకున్నారు. పెదపులిపాకలోని శ్రీ విజయరాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారికి భక్తులు విశేష పూజలు చేశారు. శ్రీవాసుదేవానందగిరిస్వామీజీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

గన్నవరంలో..

గన్నవరం: అల్లాపురంలో శ్రీదుర్గాభవాని కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన జరుగుతున్న ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్నసంతర్పణ జరిపారు. ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, ఎంపీపీ అనగాని రవి అమ్మవారిని దర్శించుకుని పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యేకు సర్పంచి డొక్కు వెంకన్నబాబు, ఉప సర్పంచి ఆవుటపల్లి శివప్రసాద్, ఉత్సవ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే వంశీ భక్తులకు అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారిని శ్రీమహిషాసురమర్దనీదేవిగా, శ్రీరాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శ్రీలలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు చేశారు. స్థానిక శ్రీగాయత్రి మందిరంలో శమీపూజ, గ్రామోత్సవం నిర్వహించారు. దావాజీగూడెం, కేసరపల్లి, బుద్దవరంలో జరుగుతున్న దసరా ఉత్సవాలు ముగిశాయి.



చినకంచిలో పూర్ణాహుతి

చినకంచిలో..

విజయవాడరూరల్: నున్నలోని చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి దేవస్థానం చినకంచిలో ఉదయం మహిషాసురమర్దని, మధ్యాహ్నం శ్రీరాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు అమ్మవారు దర్శనమివ్వగా పూజలు చేసి ఆశీస్సులు పొందారు. అనంతరం పూర్ణాహుతి చేశారు. షిర్డీ సాయిబాబా మందిరంలో అమ్మవారు మహిషాసురమర్దనిగా, శ్రీరాజరాజేశ్వరీదేవిగా అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. చెరువు సెంటర్లోని శ్రీదుర్గాదేవి దేవస్థానంలో శ్రీరాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు దర్శనమివ్వగా భక్తులు విశేషంగా పూజలు చేశారు. శ్రీఅన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీరాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పూర్ణాహుతి జరిగింది. పాతపాడు, పి.నైనవరం, అంబాపురంలో దసరా నవరాత్రులను ఘనంగా నిర్వహించారు.



ఉప్పలూరులో పూజలు చేస్తున్న భవానీలు

కంకిపాడులో..

కంకిపాడు: మండలంలో వివిధ గ్రామాల్లోని ఆలయాలు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటుచేసిన చలువ పందిళ్లలో అమ్మవారు కొలువుదీరి తొమ్మిది రోజులు పాటు ప్రత్యేక పూజలందుకున్నారు. ఉత్సవాల్లో చివరి రోజు విజయదశమి సందర్భంగా అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుజ్జి) కంకిపాడు శివాలయాన్ని సందర్శించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఉత్సవాల నిర్వహణకు రూ.20 వేలు విరాళం అందించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు చంద్రశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. ఉప్పలూరు ప్రధాన సెంటర్‌లో కొలువైన అమ్మవారికి భవానీ మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు.



అల్లాపురంలో అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే వంశీ, ఇతర నేతలు



కంకిపాడు శివాలయంలో విరాళం అందిస్తున్న కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుజ్జి)

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా

గన్నవరం ఎమ్మెల్యే వంశీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆర్య వైశ్యులకు అండగా ఉంటానని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చెప్పారు. స్థానిక ఏలూరురోడ్డులోని వాసవి కన్యక పరమేశ్వరి కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన ఆర్యవైశ్య సేవా ట్రస్ట్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజయ్యారు. తొలుత వాసవి అమ్మవారి దేవస్థానంలో ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ప్రత్యేక పూజలు చేశారు. కన్యక పరమేశ్వరి కల్యాణ మండపం వద్ద ఆర్యవైశ్య మహిళలు పూలు జల్లుతూ, కోలాటం ప్రదర్శన, మేళతాళాలతో ఎమ్మెల్యే వంశీ మోహన్‌కు సాదర స్వాగతం పలికారు. అనంతరం జరిగిన ఆర్యవైశ్య సేవా ట్రస్ట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వంశీమోహన్ మాట్లాడుతూ సమాజ సేవకు ఆర్యవైశ్యులు ముందుకు రావడం హర్షణీయమన్నారు. ఆర్యవైశ్య సేవా ట్రస్ట్‌కు సొంత నిధుల నుంచి రూ. ఐదు లక్షలను ఎమ్మెల్యే వంశీమోహన్ విరాళంగా ప్రకటించి తక్షణమే ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న అచ్చం గుప్తా కుమార్తె తనూజ వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 50 వేల ఆర్థికసాయాన్ని ఆయన పంపిణీ చేశారు. ఆర్య వైశ్యుల విజ్ఞప్తి మేరకు హనుమాన్‌జంక్షన్‌లో మహాత్మాగాంధీ, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధకుడు అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆర్యవైశ్య సేవా ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన వైకుంఠ రథం, ఫ్రీజర్ బాక్స్‌లను ఎమ్మెల్యే వంశీమోహన్ ప్రారంభించారు. అనంతరం ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పైడి సుధాకర్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ఏ సామాజిక వర్గీయులు మృతి చెందినా వైకుంఠ రథం, ఫ్రీజర్ బాక్సులు ఉచితంగా అందిస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను ఘనంగా సత్కరించారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, ఎంపీటీసీ సభ్యుడు కొనకళ్ల వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ దయాల విజయనాయుడు, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కంభంపాటి శ్రీనివాసరావు, వాసవి కన్యక పరమేశ్వరి కల్యాణ మండపం అధ్యక్షుడు చామర్తి రాంబాబు, వాసవి అమ్మవారి దేవస్థానం చైర్మన్ తవ్వా పూర్ణచంద్రరావు, ఆర్య వైశ్య సేవా ట్రస్ట్ చైర్మన్ వెస్పా వెంకటేశ్వరరావు, వాసవి క్లబ్ అధ్యక్షుడు కొనకళ్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్య సేవా ట్రస్ట్ ఏర్పాటు చేసిన వైకుంఠ రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వల్లభనేని వంశీ

ఘనంగా సాయిబాబా పుణ్యతిథి మహోత్సవం

పెనమలూరు: కానూరు సాయిబాబా మందిరంలో మంగళవారం బాబా పుణ్యతిథి మహోత్సవం నిర్వహించారు. ఉదయం 6 గంటలకు 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం చేశారు. 9 గంటలకు బాబాకు పల్లకీసేవ, 9.30 గంటలకు అన్నాభిషేకం, 10.30 గంటలకు లక్షబిల్వార్చన, 12 గంటలకు సాయి భక్తులు బాబాకు పూలసేవ చేశారు. అనంతరం మధ్యాహ్నం సుమారు మూడు వేల మంది భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు బాబాకు ప్రత్యేక హారతి ఇచ్చారు.

పోరంకిలో..

పోరంకి శ్రీనివాసనగర్‌లోని సాయిబాబా మందిరంలో బాబాకు ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిర్డీ సాయిబాబా మందిరంలో మంగళవారం బాబా పుణ్యతిథి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. బాబా సమాధి నమూనాను పూలతో అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ఆలయకమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధురానగర్ శ్రీ భగవాన్ షిర్డీ సాయిబాబా మందిరంలో మంగళవారం పుణ్యతిథి మహోత్సవం ఘనంగా జరిగింది.

ఐదు వేల మందికి అన్నదానం

రామవరప్పాడు: రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా సోమవారం అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమార్చన నీరాజనం, మంత్రపుష్పం పూజా కార్యక్రమాల అనంతరం చండీ హోమం చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం సుమారు ఐదు వేల మందికి అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, ఆలయ కార్యదర్శి పి.లోకేశ్వరి మాట్లాడుతూ దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి అమ్మవారి అలంకరణలు, విద్యుత్ అలంకరణ, భక్తులకు అందజేసిన ప్రసాదాలు, అన్న సంతర్పణలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గొల్లపూడి మార్కెట్ యార్డ్ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, జెడ్పీటీసీ సువర్ణరాజు, నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు తదితరులు పాల్గొన్నారు.



వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో అన్నదానం

పోలియోను సమూలంగా నిర్మూలిద్దాం



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న రోటరీ మిడ్‌టౌన్ అధ్యక్షుడు సాధుప్రసాద్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రపంచ వ్యాప్తంగా పోలియోను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని రోటరీ మిడ్‌టౌన్ అధ్యక్షుడు సాధుప్రసాద్ తెలిపారు. అక్టోబర్ 24 ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా రోటరీ మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో మంగళవారం పోలియో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహాత్మాగాంధీ రోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి టీటీడీ కల్యాణ మండపం వరకూ నిర్వహించిన ర్యాలీని సాధుప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలియో దినోత్సవం సందర్భంగా.. నగరంలో పోలియో నిర్మూలన అవగాహన నడకను మిడ్ టౌన్ ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పోలియోపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలియో నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రోటరీ జిల్లా గవర్నర్ రావూరి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు పోకూరి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి అజయ్, రోటరీ సభ్యులు, రోటరాక్ట్ సభ్యులు పాల్గొన్నారు.

అన్నప్రసాదం, లడ్డూపోటులో తనిఖీలు



లడ్డూలను పరిశీలిస్తున్న ఈవో కేఎస్ రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసే భవానీలు, భక్తులకు అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదాలను అందజేయడంలో ఎటువంటి అలసత్వం వహించరాదని దుర్గగుడి ఈవో కేఎస్.రామారావు ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. దేవస్థాన ప్రధాన లడ్డూ పోటు, అర్జున వీధిలోని దేవస్థాన షెడ్డులోని లడ్డూ పోటులను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. విక్రయానికి సిద్ధంగా లడ్డూలను తూకం వేసి పరిశీలించారు. లడ్డూ నాణ్యత, తూకం సక్రమంగా అందించాలని ఆదేశించారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు మంగళవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని క్యూలో అమ్మవారి దర్శనానికి విచ్చేస్తున్న భక్తులతో మాట్లాడారు. తాగునీరు, ఇతర సదుపాయాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట

పామర్రు: స్థానికులు ఘంటసాల త్రివిక్రమ సాయిరాం నాగ వెంకట హరి సునీత దంపతుల సౌజన్యంతో అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామియే శరణ మయ్యప్ప శరణ ఘోషతో సాయిరాం ఇంటి నుంచి సుమారు రూ.లక్షల విలువ గల పంచలోహాలతో తయారు చేసిన అయ్యప్ప స్వామి విగ్రహానికి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్థానిక అంకమ్మతల్లి ఆలయానికి అందజేశారు. ఆలయంలో స్వామికి విశేషంగా పంచామృతాలతో అభిషేకాలను శాస్త్రోక్తంగా అయ్యప్ప గురుస్వామి మండపాక శంకరబాబు బృందంచే నిర్వహించారు. అనంతరం ఆలయంలో అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అంకమ్మతల్లి ఆలయ కమిటీ అధ్యక్షుడు పరదా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక వేంకటేశ్వరస్వామి వ్రతం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 25వ తేదీ సామూహిక వేంకటేశ్వర స్వామి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు (బాబు), మాజీ సర్పంచ్ కాకాని అరుణ దంపతులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజా సామగ్రి తామే అందిస్తామని పేర్కొన్నారు.

సీఎస్ఐ చర్చి ప్రారంభం

గన్నవరంరూరల్: సూరంపల్లిలో కొత్తగా నిర్మించిన సెయింట్‌పాల్ సీఎస్ఐ చర్చిని సోమవారం కృష్ణా, గోదావరి అధ్యక్ష ఖండ పీఠాధిపతులు ది రైట్ రెవరెండ్ డాక్టర్ తంటేపూడి జార్జి కొర్నేలియస్ ప్రారంభించారు. ఆయన భక్తులకు సందేశమిస్తూ ఏసుక్రీస్తు చూపిన మార్గంలో అందరూ నడవాలని సూచించారు. సంఘ పెద్దలు, సంఘస్తులు, యూత్, నిర్మాణ కమిటీ, సలహాదారులు, సంఘ కాపరి ఆమోస్ పాల్గొన్నారు.

- నూతన చర్చి నిర్మాణం ప్రారంభం సందర్భంగా స్థానిక దాత, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, కరుణ దంపతులను సత్కరించారు.

గ్రంథాలయంలో సమావేశ మందిరం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎంజీ రోడ్డులోని రామమోహన గ్రంథాలయంలో చేపట్టిన మరమ్మతులలో భాగంగా పునర్ నిర్మించిన సమావేశ మందిరాన్ని మంగళవారం గ్రంథాలయ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం దసరా సందర్భంగా గ్రంథాలయంలో ఆయుధ పూజ చేశారు. 100 సీటింగ్ కెపాసిటీతో సమావేశ మందిరాన్ని నిర్మించినట్లు చెప్పారు. గ్రంథాలయంలో నిర్వహించే కార్యక్రమాలకు ఉపయోగించనున్నట్లు తెలిపారు. పుస్తకావిష్కరణ, సాహితీ సమావేశాలు, వ్యక్తిత్వ వికాస తరగతులు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ కార్యదర్శి కేశవరావు, గ్రంథాలయ ఉప అధ్యక్షులు దమ్మాల రామచంద్రరావు సభ్యులు తంగిరాల రఘురాం, చిగురుపాటి నరేష్, మద్దినేని పవన్, జె. పద్మ, కోట శ్రీకృష్ణ భగవాన్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

పెనమలూరు: యనమలకుదురులో వివాహిత అదృశ్యమవటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురుకు చెందిన లక్ష్మీప్రసన్న కొన్నేళ్ల క్రితం దుర్గానాగేంద్ర బాబును ప్రేమించి వివాహం చేసుకుంది. వీరికి ఒక కుమారుడు. ఆమె భర్త దురలవాట్లకు బానిసగా మారి కట్నం తీసుకురావాలని వేధించసాగాడు. సోమవారం భర్త మద్యం సేవించి వచ్చి భార్యను వేధించాడు. దీంతో భార్య లక్ష్మీప్రసన్న ఇంటి నుంచి అదృశ్యమైంది. ఆమె సమీపంలో ఉన్న బందరు కాలువలో దూకిందనే అనుమానంతో గాలిస్తున్నారు. తల్లి విజయరత్నకుమారి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగిసిన శత చండీయాగం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ కన్యకా పరమేశ్వరీ విస్సంశెట్టి వెంకటరత్నం హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలో చేపట్టిన శ్రీ రుద్ర సహిత అష్టోత్తర శత చండీయాగం సోమవారంతో ముగిసింది. తొమ్మిది రోజుల పాటు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శతచండీయాగాన్ని పూర్ణాహుతితో ముగించారు. కేబీఎన్ కళాశాల ప్రాంగణంలోని శ్రీ దాసాంజనేయస్వామి దేవస్థానం సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంగణంలో చేపట్టిన శత చండీయాగం కార్యక్రమం వైభవంగా ముగించారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదిదంపతుల శాంతి కల్యాణంలోని పరమార్థాన్ని పండితులు కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు వివరిస్తూ జరిపించారు. వెయ్యి మంది మహిళలతో సుహాసిని పూజ నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసి అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి అలంకారానికి సంబంధించిన మూలమంత్ర సంపుటితో చండీహోమం చేశారు. రుద్ర, సుదర్శన, లక్ష్మీగణపతి, గరుడ, మృత్యుంజయ, మన్యుసూక్త, నవగ్రహ హోమాలను శాస్త్రోక్తంగా కొనసాగించారు. సోమవారం వేద సభను నిర్వహించి, వేద పండితులను సత్కరించారు. ఉదయం కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య, కోశాధికారి గోళ్ల బాబావిజయకుమార్, కేబీఎన్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసు, కోశాధికారి అన్నం రామకృష్ణారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావులు పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి పీ లక్ష్మణస్వామి, కోశాధికారి కొత్తమాసు వెంకటేశ్వరరావు తదితరులు వైదిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 56 మంది చండీయాగంలో పాల్గొన్నారు. ఆంజనేయస్వామి వారి దేవస్థానంలోనూ స్వామి వారికి ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.